క్లుప్తంగా

'కోటంక'లో ప్రత్యేక పూజలు



అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకుడు రామాచార్యులు క్షీరాభిషేకం, పంచామృత అభిషేకం, ఆకుపూజ, అర్చనలు నిర్వహించారు. భక్తులకు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. మహిళలు, భక్తులు అధిక సం ఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



నైరుతిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్

గుంతకల్లుటౌన్: నంద్యాల జిల్లా ముచ్చుమర్రి పరిధిలోని ఎల్లాల గ్రామానికి చెందిన 8 సంవత్సరాల బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇలాంటి దుర్ఘటనలు జరగడం చాలా బాధాకరమన్నారు. వారం రోజులు గడిచినా బాలిక అదృశ్యం కేసు మిస్టరీ వీడకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోందన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మహిళల రక్షణ కోసం దిశ చట్టాన్ని, యాప్‌ను అందుబాటులోకి తెచ్చిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. చిన్నారులపై అత్యాచార ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా ఉండాలంటే అశ్లీల, హింసాత్మక సినిమాలు, మద్యం, డ్రగ్స్ విక్రయాలను నిషేధించడంతో పాటు కఠిన చట్టాలను అమలు చేయాలని ఆదివారం ఆమె ఓ ప్రకటనలో కోరారు.

లయన్స్ క్లబ్ కార్యవర్గం ఎంపిక



అధ్యక్షుడు శ్రీనివాసులును అభినందిస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలోని అనంతపురం రోడ్డులో ఉన్న విరూపాక్షి రెడ్డి ఫంక్షన్ హాల్లో ఆదివారం లయన్స్ క్లబ్ జిల్లా రెండో ఉపాధ్యక్షుడు విరూపాక్షి రెడ్డి, జోనల్ చైర్మన్ లయన్ రుకియా బేగం, డాక్టర్ సురేష్ బాబు ఆధ్వర్యంలో గుత్తి మండల లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎంపికైంది. లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా టి. శ్రీనివాసులు, కార్యదర్శిగా ఎస్.రాఘవేంద్ర స్వామి(చిన్ని), ఉపాధ్యక్షులుగా సాయి శేఖర్, తిరుపతయ్య, జాయింట్ సెక్రటరీగా నాగరాజు, కోశాధికారిగా శివ శంకర్, మరో ఐదుగురు సభ్యులు ఎంపికైయ్యారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

ముగిసిన స్త్రీల మైత్రి ఆరాధన



గీతాలు ఆలపిస్తున్న భక్తులు

పామిడి: పట్టణంలోని సీఎస్‌ఐ చర్చిలో రెండురోజులుగా నిర్వహిస్తున్న స్త్రీల మైత్రి ఆరాధన ఆదివారం ముగిసింది. ఈసందర్భంగా పాస్టరమ్మ సువర్ణమ్మ ప్రత్యేక ప్రార్థన నిర్వహించారు. పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్ క్రైస్తవులను ఉద్దేశించి ప్రసంగించారు. జ్ఞానవంతురాలు తన ఇల్లు చక్కబరుచుకుంటుందన్నారు. మూఢురాలు తన ఇల్లు ఊడ బెరుక్కుంటుందన్నారు. దేవుడైన యెహోవా నరునికి సాటియైన సహాయకారిగా నారిని సృష్టించాడన్నారు. స్త్రీలే దేవుని సంకీర్తనాలాపనలు, ప్రార్థనలు, బైబిల్ పాఠాలు పఠనం గావించడం గమనార్హం. కార్యక్రమంలో చర్చి సభ్యులు వీరయ్య, జయరాజు, అబ్రహాం, జకరయ్య, రత్నరాజు, దేవదాసు, బుజ్జిబాబు, కరుణాకర్, రాజు, రమణ, అల్లీపీరా, లక్ష్మీనారాయణ, ప్రసాద్, రజని, మంజుల, సుశీలమ్మ, శాంతమ్మ, ప్రిస్కిల్లా, మహిమ, మెర్సీ, వాణి, భారతి, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

నేడు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ హనుమంత నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమస్యలున్నవారు అర్జీలు అందజేయాలన్నారు. కార్యక్రమానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు తప్పని సరిగా హాజరు కావాలన్నారు.

రైల్వే స్టేషన్‌లో తాగునీటికి కటకట

- రెండో ప్లాట్‌ఫాంలో మంచినీరు బంద్
- లీటర్ రూ.20తో ప్రయాణికుల కొనుగోలు
- పట్టించుకోని ఉన్నతాధికారులు



తాడిపత్రి రైల్వే స్టేషన్

తాడిపత్రి రూరల్: స్థానిక రైల్వే స్టేషన్‌లో తాగునీటి కోసం ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. రెండో ప్లాట్‌ఫాంలో ఏర్పాటు చేసిన కొళాయిలకు నీరు రాకవడంతో.. రైళ్లల్లో నుంచి దిగిన ప్రయాణికులు నీళ్లు రాని కుళాయిలను చూసి అధికారులపై మండిపడుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో రైళ్లలోనే రూ.20తో లీటర్ నీటిని కొనుగోలు చేస్తున్నారు. రెండో ప్లాట్‌ఫాం పైన వాటర్ బాటిళ్లు విక్రయించే వారు సైతం నిబంధనల ప్రకారం లీటర్ రూ.15కు కాకుండా రూ. 20ను ప్రయాణికుల నుంచి వసులు చేస్తున్నారు. రోజూ దాదాపు 16 రైళ్లు తాడిపత్రి మీదుగా ప్రయాణం చేస్తుంటాయి. అధిక సంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు కొనసాగిస్తుంటారు. దూర ప్రాంతాల నుంచి ఎక్కువ సంఖ్యలో కుటుంబాలతో వచ్చిన ప్రయాణికులు ఇంటి వద్ద నుంచి రైల్వే స్టేషన్‌లోకి ఫలహారాలు తెచ్చుకుంటుంటారు. మరికొందరు క్యాంటీన్లలో కొనుగోలు చేస్తున్నారు. మొదటి ప్లాట్‌ఫాంపై ఉన్న కుళాయిలకు నీటి సరఫరా ఉంది. కానీ ఎక్కువ కుళాయిలు లేవు. కొన్నింటికి నీరు రాకుండా మూతలు బిగించారు. మరికొన్నింటికి మూతలు లేకపోవడంతో వృథాగా నీరు పోతోంది. రెండు ప్లాట్‌ఫాంలకు కలిపి నాలుగు షెడ్లు ఉన్నాయి. కేవలం రైల్వే స్టేషన్ మాస్టర్, క్యాంటీన్‌లు ఉన్న ప్రాంతంలో మాత్రమే నీటి సౌకర్యం ఉంది. మిగిలిన చోట్ల లేకపోవడంతో ప్రయాణికులు దాహంతో అలమటిస్తున్నారు.

దెబ్బతిన్న టైల్స్

రైల్వే స్టేషన్‌లో ఉన్న రెండు ప్లాట్‌ఫాంలపై వేసిన టైల్స్ దెబ్బతిన్నాయి. కొన్ని చోట్ల వేసిన టైల్స్ లేకపోగా మరి కొన్నిచోట్ల పగిలిపోయాయి. ఎగుడు దిగుడుగా టైల్స్ ఉండటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రైళ్లు వచ్చినపుడు తమ బెర్త్‌ల కోసం పరుగు తీసినపుడు ఎగుడు, దిగుడుగా ఉన్న టైల్స్ వల్ల అదుపు తప్పి కింద పడుతున్నారు. నాలుగు రోజుల క్రితం పట్టణంలోని కాంచానీ ఆసుపత్రి సమీపంలో టీస్టాల్‌కు చెందిన యువకుడు అదుపు తప్పి తృటిలో రైలు చక్రాల కింద పడకుండా తప్పించుకున్నాడు. తరచుగా ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయి. మరమ్మతులు చేసి టైల్స్‌ను సరిచేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

తొలగించిన పై కప్పులు

మొదటి ప్లాట్ ఫాంలో ప్రయాణికులు ఎండకు ఇబ్బంది పడకుండా ఏర్పాటు చేసిన సిటింగ్ బెంచీలపై ఉన్న పైకప్పులను గతంలో తొలగించారు. వాటి స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేయలేదు. పైకప్పులు లేకపోవడంతో ప్రయాణికులు వాటిపై కూర్చోలేకపోతున్నారు. కేవలం షెడ్లల్లో మాత్రమే కూర్చోవాల్సి వస్తోంది. రైళ్లలో బెర్తుల కోసం రిజర్వేషన్ చేయించుకున్న ప్రయాణికుల కోసం అక్కడక్కడ బెంచీలను ఏర్పాటు చేశారు. జనరల్ బోగిల్లో ప్రయాణించే వారికి కూడా ఎంతో ఉపయోగంగా ఉండేవి. ప్రస్తుతం ప్రయాణికులు షెడ్లల్లో కూర్చొంటూ రైళ్లు వచ్చినపుడు బెర్తుల కోసం పరిగెత్తుతూ ప్రమాదాల బారిన పడుగున్నారు. ఉన్నతాధికారులు స్పందించి రైల్వే స్టేషన్‌లో సమస్యలు పరిష్కరించాల్సి ఉంది.



మొదటి ప్లాట్‌ఫాంలో మూత బిగించిన దృశ్యం



రెండో ప్లాట్‌ఫాంలో నీరు రాని కుళాయిలు



టైల్స్ పగిలిపోయిన దృశ్యం

నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటాం

రైల్వే స్టేషన్‌లో తాగునీటి సమస్య లేకుండా చూస్తాం. ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా వెంటనే కొళాయిలకు మరమ్మతులు చేయిస్తాం. నీటి సమస్య గురించి ఎలాంటి ఫిర్యాదులు అందలేదు. వృథాగా పోతున్న నీటిని అరికడతాం. పనులు జరుగుతుండటం వల్ల ప్లాట్‌ఫారంపై దెబ్బతిన్న టైల్స్ మార్చడంతో జాప్యం అవుతోంది.

–అనిల్‌కుమార్, రైల్వే స్టేషన్ మేనేజర్

నేడు హైకోర్టు జడ్జి రాక

తాడిపత్రి రూరల్: విజయవాడ నుంచి హైకోర్టు జడ్జి శ్రీనివాసరెడ్డి సోమవారం ఉదయం రైలులో తాడిపత్రికి రానున్నారు. స్థానిక రైల్వే స్టేషన్‌లో డీఎస్పీ జనార్దన్‌నాయుడు, పోలీసు అధికారులు ఆయనకు స్వాగతం పలకనున్నారు. అక్కడి నుంచి జడ్జి పెద్దపప్పూరు మండలం చిన్నపప్పూరుకు వెళ్లి ఇటీవల మృతిచెందిన బంధువు కుటుంబ సభ్యులను పరామర్శించనున్నారు. అదే రోజు రాత్రి ఏడున్నర గంటల సమయంలో రైలులో విజయవాడకు బయలుదేరి వెళ్లనున్నారు.

రేపటి నుంచి విఠోబస్వామి బ్రహ్మోత్సవాలు

పామిడి: పట్టణంలోని రంగసుభే ఫిర్కా భగవాన్ దాస్ విఠోబస్వామి దేవాలయం ఆధ్వర్యంలో ఈ నెల 16 నుంచి రుక్మిణీ పాండురంగస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నట్లు ఈఓ ఏ క్రిష్ణయ్య, కమిటీ సభ్యులు టీటీ నాగభూషణ్‌రావు, యూ మంజునాథ్‌రావు ఆదివారం తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 20న సాయంత్రం భావసార క్షత్రియ సమాజ్ సంతర్పణ, 21న సాయంత్రం దీపోత్సవం, 22న దిండి భజనతో కూడిన ఉట్ల పరుషతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయన్నారు. 23న మంగళవారం పామిడమ్మ దేవత హారతి ఉంటుందన్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకూ అన్నమాచార్య ప్రాజెక్ట్ వారిచే హరికథ కాలక్షేపం ఉంటుందన్నారు. ఉత్సవాలకు భక్తులు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

21న గురు పౌర్ణమి

గుత్తి: పట్టణంలోని సీఎస్‌ఐ చర్చి వద్ద ఉన్న షిరిడీ సాయిబాబా ఆలయంలో ఈ నెల 21న గురు పౌర్ణమి వేడుకలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు జేజె రాము పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం ఆరు గంటల నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకూ ఆలయంలో ప్రత్యేక పూజలుంటాయన్నారు. భక్తులు హాజరై గురుపౌర్ణమి వేడుకలను జయప్రదం చేయాలని ఆయన కోరారు.

వాహనం ఢీ.. విరిగిన రైల్వే గేట్



బొలెరో వాహనం ఢీకొనడంతో విరిగిన రైల్వే గేట్

గార్లదిన్నె: మండల కేంద్రంలోని డ్యాం రోడ్డులో రైల్వే గేట్‌ను లగేజీ బొలెరో వాహనం ఢీకొంది. పోలీసుల వివరాల మేరకు.. గార్లదిన్నె నుంచి మర్తాడు వైపు చీనీకాయల కూలీల కోసం బొలెరో వాహనం వెళ్తుండగా అధికారులు రైల్వే గేట్ వేసేందుకు సైరన్ మోగించారు. ఆ సమయంలో బొలెరో డ్రైవర్ వేగంగా వాహనం నడుపుకుంటూ రైల్వే గేట్ దాటే ప్రయత్నం చేశాడు. ఒక వైపు గేట్ దాటుకోగా.. రెండోవైపు ఉన్న రైల్వే గేట్ కిందకు దింపడంతో వాహనం రైల్వే గేట్‌ను ఢీకొట్టింది. దీంతో రైల్వే గేట్ విరిగి పోయింది. వెంటనే రైల్వే సిబ్బంది తాత్కాలిక గేట్ వేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

'రెడ్డి వివాహ పరిచయ వేదిక' విజయవంతం

రాప్తాడురూరల్: రాయలసీమ రెడ్డి జన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 'రెడ్డి వివాహ పరిచయ వేదిక' విజయవంతమైంది. అనంతపురం రూరల్ పాపంపేటలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన వివాహ పరిచయ వేదికకు జిల్లాతో పాటు పొరుగు జిల్లాల నుంచి దాదాపు 80 మంది దాకా హాజరయ్యారు. వధువు, వరుడి వివరాలు, ఫొటోలు పరిశీలించారు. ప్రతినెలా రెండో ఆదివారం ఈ కార్యక్రమం ఏర్పాటు చేస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి, రెడ్డి జన సంఘం వ్యవస్థాపకుడు రొద్దం సురేష్ రెడ్డి, సెక్రటరీ దుబ్బ కిషోర్ రెడ్డి, ట్రెజరర్ తోపుదుర్తి రామకృష్ణారెడ్డి, ఈసీ మెంబర్లు మంత్రి విశ్వనాథ్ రెడ్డి, కల్లూరు నాగరత్నారెడ్డి, చంద్రమౌళి రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, డాక్టర్ బాబుల్ రెడ్డి, ప్రొఫెసర్ లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్‌కు సాహస్ర సేవా మిత్ర అవార్డు



పాస్టర్ ప్రసాద్

యాడికి: మండల కేంద్రంలో కమలపాడు రహదారిలో ఉన్న అగాపే చర్చి పాస్టర్ ప్రసాద్‌కు ఆదివారం సాహస్ర సేవామిత్ర సార్వభౌమ అవార్డు అందజేశారు. 2020 నుంచి అగాపే ట్రస్టు పేరుతో ఆయన ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కరోనా సమయంలో రోజూ 200 మందికి దాదాపు 2నెలల పాటు అన్నం పొట్లాలు అందజేశారు. 2023లో అగాపే వృద్ధాశ్రమాన్ని స్థాపించి అనాథలు, అభాగ్యులను ఆదరిస్తున్నాడు. తన సేవలను గుర్తించిన నంద్యాల జిల్లా కొలిమిగుండ్లకు చెందిన కళా స్రవంతి సాహితీ, సాంస్కృతిక సంస్థ వారు సాహస్ర సేవా మిత్ర సార్వభౌమ–2024 అవార్డును అందించారని ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా పాస్టర్‌ను పలువురు అభినందించారు.

మొహర్రం వేడుకల్లో అల్లర్లు సృష్టిస్తే కేసులు



పెద్దవడుగూరులో మాట్లాడుతున్న తాడిపత్రి డీఎస్పీ జనార్దన్‌నాయుడు.

యాడికి/పెద్దవడుగూరు/పెద్దపప్పూరు: మొహర్రం వేడుకల్లో అల్లర్లు సృష్టిస్తే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తాడిపత్రి డీఎస్పీ జనార్దన నాయుడు హెచ్చరించారు. ఆదివారం యాడికి పోలీస్‌స్టేషన్‌లో మండలంలోని మజావర్లు, మకాన్ కమిటీ గ్రామ పెద్దలతో వారు సమావేశమయ్యారు. డీఎస్పీ మాట్లాడుతూ మండలంలోని చందన, రాయలచెరువు, లక్షుంపల్లె, కేశవరాయుని పేట, దైవాలమడుగు, రామరాజుపల్లె, తూట్రాళ్లపల్లె, చింతలాయపల్లె, కమలపాడు గ్రామాల్లో చిన్నసరిగెత్తు, పెద్దసరిగెత్తు, జలధి కార్యక్రమాల్లో గొడవలు చేసుకోకుండా పీర్ల పండుగను ప్రశాంతంగా చేసుకోవాలన్నారు. చిన్నపాటి ఘర్షణ చోటుచేసుకున్నా కమిటీ సభ్యులపై కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో సీఐ నాగార్జున రెడ్డి, పోలీసులు పాల్గొన్నారు. అలాగే పెద్దవడుగూరు పోలీస్ స్టేషన్ 25 పంచాయతీల గ్రామపెద్దలు, ముస్లింలతో డీఎస్పీ సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో యాడికి రూరల్ సర్కిల్ సీఐ రోషన్, ఎస్‌ఐ చిన్నరెడ్డప్ప, సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా పెద్దపప్పూరు పోలీస్ స్టేషన్‌లో ముజావర్లు, కమిటీ సభ్యులతో డీఎస్పీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎస్‌ఐ గౌస్ బాషా తదితరులు పాల్గొన్నారు.

నాలుగు గ్రామాల్లో బందోబస్తు

తాడిపత్రి రూరల్: మొహర్రం సందర్భంగా మండలంలోని నాలుగు గ్రామాల్లో బందోబస్తు ఏర్పాటు చేశామని రూరల్ అప్‌గ్రేడ్ సీఐ లక్ష్మీకాంతరెడ్డి ఆదివారం తెలిపారు. స్థానిక రాజకీయ పరిస్థితులు, గతంలో జరిగిన సంఘటనలను దృష్టిలో ఉంచుకుని బ్రహ్మణపల్లి, ఊరుచింతల, చుక్కలూరు, సజ్జలదిన్నె గ్రామాల్లో బందోబస్తును ఏర్పాటు చేశామన్నారు. మొహర్రం నిర్వహించే గ్రామాలపై పోలీసుల నిఘా ఉంటుందన్నారు.

మద్యం బాటిళ్ల పట్టివేత

గుత్తి: పట్టణంలోని గాంధీ సర్కిల్ సమీపంలో ఆదివారం గురుమోహన్‌రెడ్డి అనే వ్యక్తి ద్విచక్ర వాహనంలో అక్రమంగా మద్యం బాటిళ్లను తీసుకెళుతుండగా పోలీసులు పట్టుకున్నారు. ఊటకల్లుకు చెందిన గురు మోహన్ రెడ్డి బాటిళ్లను ద్విచక్ర వాహనంలో అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి 14 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనపై ఎస్‌ఐ నబీరసూల్ కేసు దర్యాప్తు చేపట్టారు. మద్యం తరలిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు.

ఆర్టీసీ డ్రైవర్, ఆటో డ్రైవర్ ఘర్షణ

గార్లదిన్నె: మండల కేంద్రంలోని రైల్వే గేట్ వద్ద ఆదివారం ఆర్టీసీ బస్సు డ్రైవర్, ఆటో డ్రైవర్ ఘర్షణ పడిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసుల వివరాలు మేరకు.. గార్లదిన్నె ఇందిరమ్మ కాలనీకి చెందిన వరదరాజులునాయక్ ఆటో నడుపుకుంటూ రైల్వే గేట్ సమీపంలోకి రాగానే.. గేట్ వేయడంతో అతడు ఆటో రోడ్డుపై నిలిపాడు. అదే సమయంలో పెనకచెర్ల డ్యాం నుంచి అనంతపురం వస్తున్న ఆర్టీసీ డ్రైవర్ మహబూబ్‌పీరా ఆటో పక్కనే బస్సును ముందుకు తీసుకెళ్లాడు. ఈ క్రమంలో ఆటో డ్రైవర్ వరదరాజులు బస్సు డోర్ పగలగొట్టి డ్రైవర్‌తో గొడవ పడ్డాడు. ఇద్దరూ వాగ్వాదం చేసుకున్నారు. ఆర్టీసీ డ్రైవర్ ఫిర్యాదు మేరకు ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ తెలిపారు.

గ్రామాల్లో కొలువుదీరిన పీర్లు



తాడిపత్రిలోని దొంగ్రీ చావిడిలో కొలువుదీరిన పీర్లు



పుట్లూరు మండలం ఎల్లుట్లలో అగ్నిగుండం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

తాడిపత్రి అర్బన్: మొహర్రం ఉత్సవాల్లో భాగంగా ఆదివారం చిన్న సరిగెత్తు నిర్వహించారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లోని చావిడుల్లో పీర్ల కొలువుదీరాయి. స్థానిక చింతల వెంకటరమణ స్వామి ఆలయం వద్ద ఉన్న డొంగ్రీ పీర్లచావడి, నందలపాడులోని పీర్ల చావడి, క్రిష్ణాపురం ఆరో రోడ్డులోని పీర్ల చావడిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. హిందువులు, ముస్లింలు చక్కెర ఫాతేహాలు చదివించి పూజలు చేశారు. పీర్ల చావడి ముందు ఏర్పాటు చేసిన అగ్నిగుండంలో భక్తులు చక్కెర, కొబ్బరి వేసి మొక్కుబడులు తీర్చుకున్నారు.

పుట్లూరు: మండలంలోని ఎల్లుట్ల గ్రామంలో మొహర్రం వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం చిన్న సరిగెత్తు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అగ్నిగుండం చుట్టూ ప్రదక్షిణలు చేసి పీర్లకు చక్కె చదివించారు. యువకులు, పిల్లలు డప్పు వాయిద్యాలకు అనుగుణంగా అలావ్ తొక్కారు.

యాడికి: మొహర్రం వేడుకలు యాడికి మండలంలోని పలు గ్రామాల్లో కొనసాగుతున్నాయి. భక్తులు మకాన్‌కు తరలి వచ్చి మొక్కుబడులు తీర్చుకుంటున్నారు. ఆదివారం ముజావర్లు పీర్ల చావిడిలో ప్రత్యేక ఫాతేహాలు, చిన్న సరిగెత్తు వేడుకలు నిర్వహించారు. మండలంలోని చందన గ్రామంలో పెద్దపీరు స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రాత్రి 10 గంటలకు బొడ్డుపీరు స్వామితో పాటు మరో మూడు పీర్లతో గ్రామోత్సవం నిర్వహించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ నాగార్జునరెడ్డి తన సిబ్బందిదో బందోబస్తు ఏర్పాటు చేశారు.

బుక్కరాయసముద్రం: మండలంలోని గోవిందపల్లి, బీకేఎస్, పొదరాళ్ల, రెడ్డిపల్లి, వెంకటాపురం, చెన్నంపల్లి, బొమ్మలాటపల్లి, కొండాపురం, జంతలూరు, తదితర గ్రామాల్లో మొహర్రం వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. గ్రామాల్లోని పీర్ల చావిడిల్లో పీర్లు కొలువు తీరగా భక్తులు చక్కెర చదివించారు.

గార్లదిన్నె: మొహర్రం వేడుకల్లో భాగంగా మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో ఆదివారం పీర్ల చావిడిలో పీర్లు కొలువు దీరాయి. భక్తులు పీర్లకు చక్కెర చదివించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం పీర్లను మేళతాళాల మధ్య ఊరేగించారు.



పుట్లూరు మండలం ఎల్లుట్లలో అలంకరణలో పీర్లు



యాడికి మండలం చందన మకాన్‌లో పెద్దపీరు స్వామితో పాటు పీర్లను అలంకరించిన దృశ్యం



బుక్కరాయసముద్రం మండలం గోవిందపల్లిలో కొలువుదీరిన పీర్లు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

తాడిపత్రి రూరల్: మండలంలోని వంగనూరు వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆంజనేయులు(32) అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడని పోలీసులు తెలిపారు. వంగనూరు గ్రామానికి చెందిన ఆయన ద్విచక్ర వాహనంలో తాడిపత్రికి బయలుదేరాడు. ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యుల సూచన మేరకు బంధువులు అతడిని అనంతపురానికి తరలించారు.

నాటుసారా విక్రేత అరెస్టు

యాడికి: మండలంలోని గుడిపాడు గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న దండు కంబగిరిస్వామిని అరెస్టు చేసినట్లు సీఐ నాగార్జున రెడ్డి తెలిపారు. అతడి నుంచి 12 బాటిళ్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

బాలికపై అత్యాచారయత్నం

నార్పల: బాలికపై ఓ కామాంధుడు అత్యాచారయత్నానికి పాల్పడిన ఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు.. మండల కేంద్రానికి చెందిన నాగరాజు ఇంట్లో జిరాక్స్ మిషన్ పెట్టుకుని జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో జిరాక్స్ చేయించుకునేందుకు వచ్చిన ఓ బాలికపై అతడు అత్యాచారానికి యత్నించాడు. అతడి బారి నుంచి తప్పించుకున్న బాలిక ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు తెలపడంతో.. వారు వచ్చి కామాంధుడికి దేహశుద్ధి చేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.